అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట


దుగుమర్రిలో ఆర్బీకే ప్రారంభించిన ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి


గజరాంపల్లిలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి


వృద్ధురాలికి చేకూరిన లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

నార్పల: సీఎం జగనన్న ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. బుధవారం ఆమె దుగుమర్రి, నిలితోటపల్లి, నరసాపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆమె ప్రభుత్వవిద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డితో కలిసి దుగుమర్రిలోని గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవనాలను ప్రారంభించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు ప్రభుత్వం అందించిన లబ్ధిని వివరించారు. స్థానికులు పలు సమస్యలు ఆమె దృష్టికి తీసుకురాగా వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగనన్న రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడంతో పాటు ప్రజా సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. మేనిఫెస్టోలోని అంశాలను 99 శాతం అమలుచేసిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ నిట్టూరు రఘునాథ్‌రెడ్డి, అనంతపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి, ఎంపీపీ నాగేశ్వరావు, ఎంపీటీసీ శారద, కో ఆప్షన్ షాబీరా, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మిద్దె కుళ్లాయప్ప, నాయకులు బయపరెడ్డి, నారాయణరెడ్డి, వెంకటరామిరెడ్డి, తిరుపాల్‌రెడ్డి, రాజారెడ్డి, రాంచంద్రారెడ్డి, శేఖరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే రామరాజ్యం

- ఎమ్మెల్యే వై. వెంకట్రామిరెడ్డి

పామిడి: ముఖ్యమంత్రి జగనన్నతోనే రామరాజ్యం సాధ్యమని ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి అన్నారు. బుధవారం గజరాంపల్లి, పాగరూరులో వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత పీ అనిమిరెడ్డి, కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎల్ మధుసూదన్‌రెడ్డి, గుంతకల్ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డితో ఎమ్మెల్యే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఆయా గ్రామాల్లో ప్రభుత్వం అందించిన లబ్ధిని ప్రజలకు వివరించారు. గజరాంపల్లిలో ప్రభుత్వ పాఠశాలలకు పక్కా భవనం నిర్మించాలని గ్రామస్తులు కోరారు. గ్రామంలో కుమారుని, కోడలును కోల్పోయి దుర్భర పరిస్థితిలో ఉన్న రామలక్ష్మికి, ఎమ్మెల్యే రూ.10వేలు, ఇంటర్ విద్యార్థి రవీంద్ర పాఠ్యపుస్తకాల కోసం రూ.5 వేలు అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాసంకల్ప పాదయాత్రలో ఇచ్చిన హామీల్లో 99 శాతం హామీలను నెరవేర్చిన ఘనత జగనన్నే దక్కిందన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. అధికారం కోసం మోసపూరిత వాగ్దానాలిచ్చే చంద్రబాబును నమ్మేంతా అమాయకత్వంలో ప్రజలు లేరన్నారు. అతనికి వంతపాడుతున్న జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రాజకీయ పన్నాగం ప్రజలకు తెలియంది కాదన్నారు. అన్నివర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకెళ్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా ఆశీర్వదించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ సీబీ జానకిరామిరెడ్డి, మండల కన్వీనర్ కే నారాయణరెడ్డి, జెడ్పీటీసీ ఎల్ శోభారాణి, ఓసీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమ్మెత లక్ష్మి, ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ నక్కా సౌభాగ్య, గుత్తి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ పెమ్మక చెన్నకేశవరెడ్డి, సీనియర్ నేత ప్రతాప్‌రెడ్డి, సచివాలయాల పట్టణ కన్వీనర్ బీ ఆసిఫ్, జోజోడే కుమార్, అనుంపల్లి సూరి, భాస్కర్‌రెడ్డి, రమణారెడ్డి, జయరామిరెడ్డి, నక్కా ఓబులేసు, ఫర్యాద్, గౌస్, శివయ్య, ఫక్ర, ఎంహెచ్ అనిల్‌కుమార్‌రెడ్డి, నెల్లి హనుమంతరెడ్డి, హరినాథ్‌రెడ్డి, గోపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ వచ్చేది జగనన్న ప్రభుత్వమే

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి: రాష్ట్రంలో మళ్లీ వచ్చేది జగనన్న ప్రభుత్వమేనని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బుధవారం సాయంత్రం ఆయన పట్టణంలోని 7వ వార్డు ఓం శాంతి నగర్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్యతో కలిసి ఇంటింటికీ తిరిగి నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని వివరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే ఉన్న ప్రభుత్వాసుపత్రి స్థానంలో వంద పడకలకు మార్చుతూ నూతన ఆసుపత్రి భవన నిర్మాణాన్ని చేపట్టామన్నారు. నూతన కూరగాయల మార్కెట్ వద్ద వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఇప్పటికే ప్రారంభించామని గుర్తు చేశారు. తాడిపత్రి అభివృద్ధికి కట్టుబడి ఉన్నానన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎల్లప్పుడూ తన కార్యాలయం తలుపులు తెరచే ఉంటాయన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా వర్షాకాలంలో విద్యుత్ అంతరాయం తలెత్త కూడదన్న ఉద్దేశంతో ఇనుప విద్యుత్‌స్తంభాల స్థానంలో సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులకు చెప్పామన్నారు. స్థానికులతో సమస్యలను తెలుసుకుని, పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గాడిమాను షఫి, మురళి, రామాంజినేయులు, ఆంజినేయులు, జావీద్, బాబా, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎమ్మెల్యేకు ప్రమీల కృతజ్ఞతలు


ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతికి కృతజ్ఞతలు తెలియజేస్తున్న ప్రమీల

శింగనమల: ఏపీ నాటక అకాడమీ చైర్‌పర్సన్‌గా శింగనమల మండలం సీ.బండమీదపల్లికి చెందిన ప్రమీల నియమితులైన విషయం తెలిసిందే. బుధవారం ఆమె ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఎంపికకు ఎమ్మెల్యే , ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి కృషి చేశారని, ఈపదవి ఎస్సీలకు మరోమారు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మాజీ సర్పంచ్ వెంకటప్ప, సర్పంచ్ సరోజమ్మ, నాయకులు తిరుపతయ్య, నరసింహారెడ్డి, సాకే లోకనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి


సమస్యలు తెలుసుకుంటున్న కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

తాడిపత్రి: వార్డుల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వైఎస్సార్‌సీపీ యువనేత కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఉదయం ఆయన నందలపాడు సచివాలయం-2 పరిధిలోని వార్డుల్లో పర్యటించారు. ఈసందర్భంగా ఆయన వీధుల్లో కలియ తిరుగుతూ స్థానికులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతున్నాయా అని ఆరా తీశారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలని కోరారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

బుక్కరాయసముద్రం: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయ భాస్కర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ సునీత అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

చదువుకుంటే ఆదివాసీల్లో మార్పు


విద్యార్థులకు నోటు పుస్తకాలు అందిస్తున్న మార్కెట్ యార్డ్ వైస్ చైర్‌పర్సన్ మూడ్ గీత

శింగనమల: చదువుకుంటే ఆదివాసీల్లో(గిరిజనులు) మార్పు వస్తుందని శింగనమల మార్కెట్ యార్డ్ వైస్ చైర్‌పర్సన్ మూడ్ గీత అన్నారు. ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని పురస్కరించుకొని నాగులగుడ్డం తండాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కేక్ కట్ చేసి, విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువుకొని ఉన్నత స్థానాలకు ఎదిగితే సమాజంలో గుర్తింపు లభిస్తుందన్నారు. పిల్లలు బాగా చదివించాలని సూచించారు. పాఠశాల హెచ్‌ఎం సత్యవతి, ఉపాధ్యాయులు రాందాసు, హేమలత, గిరిజన ప్రజా సమాఖ్య నాయకులు శ్రీనివాసులు నాయక్, సుదీర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం తనిఖీ

శింగనమల: స్థానిక గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథలయ సంస్థ కార్యదర్శి రమ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రంథాలయంలోని రికార్డులను పరిశీలించారు. గ్రంథాలయానికి పాఠకులు ఎక్కువ మంది వచ్చేలా చూడాలని గ్రంథాలయ అధికారి కృష్ణకు సూచించారు. గ్రంథాలయం సెస్స్ కట్టించాలని ఆదేశించారు.

అండర్ - 16 క్రికెట్ జట్టుకు తాడిపత్రి క్రీడాకారులు


తాడిపత్రి క్రీడాకారులతో కోచ్ భార్గవ్, సీనియర్ కోచ్ సాదక్‌వలి

తాడిపత్రి: గత నెలలో అనంతపురంలోని ఆర్డీటీ క్రీడా మైదానంలో జరిగిన అండర్ - 16 బాలుర క్రికెట్ జట్టుకు తాడిపత్రికి చెందిన క్రీడాకారులు పలువురు ఎంపికైనట్లు ఆర్డీటీ కోచ్ భార్గవ్ బుధవారం తెలిపారు. జిల్లా స్థాయిలో జరిగిన ఎంపిక ప్రక్రియకు 200 మంది క్రీడాకారులు హాజరయ్యారన్నారు. ఇందులో అండర్ - 16 కు తాడిపత్రికి చెందిన మహ్మద్ తమీం, మహమ్మద్ ఆసిఫ్, సమీర్, షేక్ సంధాని ఎంపికయ్యారన్నారు. ఎంపికైన క్రీడాకారులు గురువారం నుంచి 26 వరకు వెంకటగిరిలో జరిగే టోర్నీలో పాల్గొంటారన్నారు. క్రీడాకారుల ఎంపికపై సీనియర్ కోచ్ సాదక్‌వలి, ఆర్డీటీ ఏటీఎల్ రామాంజినేయులు హర్షం వ్యక్తం చేశారు.

బడుగుజీవుల బంకులపై రాజకీయం తగదు


మాట్లాడుతున్న మున్సిపల్ మాజీ చైర్మన్ ఎస్.రామలింగప్ప

గుంతకల్లుటౌన్: ఆర్‌అండ్‌బీ బంగ్లా వద్దనున్న మున్సిపల్ స్థలంలో బడుగు, బలహీనవర్గాల బతుకు దెరువు కోసం ఏర్పాటు చేయిస్తున్న రేకులషెడ్(బంక్)లపై సీపీఐ,టీడీపీ నాయకులు నీచరాజకీయాలు చేయడం తగదని వైఎస్సార్‌సీపీ బీసీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మున్సిపల్ మాజీ చైర్మన్ రామలింగప్ప హితవు పలికారు. బంక్‌ల ఏర్పాటులో వైఎస్సార్‌సీపీ నేతలు అక్రమాలకు పాల్పడ్డారని సీపీఐ రాష్ట్ర నేత జగదీష్ ఆరోపించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. బుధవారం రామలింగప్ప విలేకరులతో మాట్లాడుతూ బంక్‌ల ఏర్పాటులో అక్రమాలు జరిగినట్లు సీపీఐ, టీడీపీ నాయకులు నిరూపిస్తే మౌలానాకలాం విగ్రహం వద్ద మేము బహిరంగ ఉరికి సిద్ధమని, నిరూపించకపోతే మీరు ఉరేసుకుంటారా అని నిలదీశారు. మాస్టర్‌ప్లాన్ ప్రకారం 60 అడుగల రోడ్డు అని, అయితే మరో 32 అడుగుల స్థలం మిగిలి ఉంటే అందులో సుమారు 30 ఏళ్ల నుంచి మున్సిపాల్టీకి ఎంక్రోచ్‌మెంట్ ట్యాక్స్ కట్టిన వాళ్లకు మాత్రమే బంక్‌ల ఏర్పాటు చేయిస్తున్నామని వెల్లడించారు. బంక్‌ల ఏర్పాటులో మున్సిపల్ అధికారులకు సంబంధం లేదని, సీపీఐ నాయకులు అవివేకంతో అధికారులపై బురద చల్లడం సబబుకాదన్నారు. కౌన్సిలర్ చాంద్‌బాషా మాట్లాడుతూ బంక్‌ల ఏర్పాటులో అక్రమాలకు పాల్పడినట్లు నిరూపిస్తే కౌన్సిలర్ పదవికి రాజీనామా చేస్తానన్నారు. కౌన్సిలర్లుగా బంక్‌ల ద్వారా చిరువ్యాపారాలు చేసుకుంటూ జీవనాన్ని సాగిస్తున్న తమ పొట్టకొడితే ఊరుకునేది లేదని పేదలు ఆయా పార్టీల నేతలకు హెచ్చరించారు. ఎస్సీసెల్ జోనల్ ఇన్‌చార్జ్ జింకల రామాంజినేయులు, కౌన్సిలర్లు చాంద్‌బాష, చాముండేశ్వరి, సుధాకర్, సచివాలయాల కన్వీనర్ ఖలీల్ పాల్గొన్నారు.

'జే' ట్యాక్స్ అని రాస్తే సహించేది లేదు

బంక్‌ల ఏర్పాటు విషయంలో వైసీపీ వ్యాపారం చేస్తుందని, 'జే' ట్యాక్స్ తరహా పద్ధతిని అవలంబిస్తున్నారని ఓ పచ్చపత్రిక రాసిన కథనంపై మున్సిపల్ మాజీ చైర్మన్ రామలింగప్ప మండిపడ్డారు. జే ట్యాక్స్ అంటే అర్థమేంటో చెప్పాలన్నారు. గుంతకల్లులో బంక్‌ల ఏర్పాటుకు సీఎం వైఎస్ జగన్‌కు ఏం సంబంధమని, మరోసారి ఇలాగే రాస్తే సహించేది లేదన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

పామిడి: తంబళ్ళపల్లి, నీలూరు గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరగనుంది. ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు కోరాయి.

పోలీసులకు జింక పిల్ల అప్పగింత



పామిడి: గజరాంపల్లిలో బుధవారం కుక్కల దాడిలో ఓ జింకపిల్ల గాయపడింది. గమనించిన గ్రామస్తులు సూర్యనారాయణరెడ్డి, వెంకట్రామిరెడ్డి జింకను కుక్కల బారినుంచి కాపాడారు. వారు జింకపిల్లను నేరుగా స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి సీఐ రాజశేఖర్‌రెడ్డికి అప్పగించారు. సీఐ గాయపడ్డ జింకపిల్లను వెటర్నరీ వైద్యునిచే వైద్యం చేయించారు. అనంతరం జింకపిల్లను సీఐ, ఫారెస్ట్ అధికారి చంద్రకు అప్పగించారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లుటౌన్: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి తెలిపారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా బుధవారం మున్సిపాల్టీ ఆధ్వర్యంలో కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. రక్తదానంపై అపోహలు వీడి ఆరోగ్యవంతులైన వారు క్రమంగా రక్తదానం చేసి ప్రాణదాతలుగా జీవించాలన్నారు. రక్తదాతలు ప్రభుత్వ ఆస్పత్రిలో బ్లడ్‌బ్యాంక్‌లో అందజేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. శిబిరంలో వందమంది రక్తదానం చే శారు. మహిళలు అధిక సంఖ్యలో రక్తదానం చేసి అందరికీ ఆదర్శంగా నిలిచారు. అనంతరం రక్తదాతలకు ఎమ్మెల్యే ప్రశంసాపత్రాలతో పాటు పండ్లు అందజేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వాస్పత్రిలో బ్లడ్‌బ్యాంక్‌ను ఏర్పాటు చేయించిన ఎమ్మెల్యే వైవీఆర్‌ను జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్, నాయకులు ఘనంగా సన్మానించారు. బ్లడ్‌బ్యాంక్‌లో కంపోనెంట్స్ ఏర్పాటు చేయాలని జేవీవీ నాయకులు కోరగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మైమూన్, మాజీ మున్సిపల్ చైర్మన్ రామలింగప్ప, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రసాద్, డాక్టర్ వంశీకృష్ణ, కౌన్సిలర్లు చాముండేశ్వరి, చాంద్‌బాషా, మెప్మా టీపీఆర్ఓ మోహన్, సీఎంఎం.భవానీ, సీఓలు, మహిళా సంఘాల సభ్యులు, రోటరీ, ఇన్నర్‌వీల్ క్లబ్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

వార్డు మెంబర్ స్థానానికి నామినేషన్


ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలను అందజేస్తున్న ధర్మవరం అనూరాధ

పుట్లూరు: మండలంలోని చెర్లోపల్లి గ్రామంలో 1వ వార్డు మెంబర్ స్థానానికి బుధవారం ఒక నామినేషన్ దాఖలైనట్లు స్టేజ్-1 ఎన్నికల రిటర్నింగ్ అధికారి యల్లమనాయుడు తెలిపారు. చెర్లోపల్లి గ్రామానికి చెందిన ధర్మవరం అనూరాధ వైఎస్సార్ సీపీ మద్దతుదారు అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. వైఎస్సార్‌సీపీ నేత వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

పెద్దపప్పూరు: దేవుని ఉప్పలపాడు ఉప సర్పంచు ఎన్నికలకు సంబంధించి బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో తలారి కాటమయ్య తలారి అశ్వత్ నామినేషన్ దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి జిలాన్ బాషా తెలిపారు. నేటితో నామినేషన్ ప్రక్రియ ముగిసిందన్నారు.

యాడికి: మండలంలో యాడికి మేజర్ గ్రామ పంచాయతీ, రాయలచెరువు, నగరూరు, వెంగన్నపల్లె గ్రామాల్లో ఖాళీగా ఉన్న 4 వార్డు స్థానాలకు 7 నామినేషన్లు దాఖలైనట్లు అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. ఎంపీడీఓ సమావేశ భవనంలో నామినేన్ల ప్రక్రియ జరిగింది. యాడికి 19 వార్డుకు ఎస్సీ జనరల్‌కు 3 నామినేషన్లు, రాయలచెరువు 12వ వార్డుకు 1, నగరూరు 1వ వార్డుకు 1 , వెంగన్నపల్లె 5వ వార్డుకు 1 నామినేషన్ దాఖలైనట్లు ఏఆర్ఓ తెలిపారు. యాడికిలో 19వ వార్డుకు మేకల శ్రీరాములు చేత వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, యాడికి ఉప సర్పంచు కాసా చంద్రమోహన్ నామినేషన్ వేయించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత బ్రహ్మానందరెడ్డి నగరూరులో వెన్నపూస విజయ్‌కుమార్ రెడ్డి చేత, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేష్, రషీద్ రాయలచెరువులో మేకల రేవతి చేత నామినేషన్ వేయించారు.

సంక్షిప్త సమాచారం

రీ సర్వేకు రైతులు సహకరించాలి

బుక్కరాయసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న భూ రీసర్వేకు రైతులు సహకరించాలని రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ నారాయణస్వామి కోరారు. బుధవారం బొమ్మలాటపల్లిలో రీ సర్వేపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం భూములను సర్వే చేసి హద్దులను ఏర్పాటు చేసి ఉచితంగా రాళ్లను పాతిస్తుందన్నారు. మండల సర్వేయర్ రఘునాథ్, వీఆర్ఓ శ్రీనివాసరెడ్డి, విలేజ్ సర్వేయర్ తిప్పేస్వామి, సర్పంచ్ సుధాకర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

హక్కులను కాలరాస్తున్న మోదీ సర్కార్

గుంతకల్లుటౌన్: ఒకేదేశం, ఒకే ఉత్పత్తి, ఒకే కార్పొరేట్, ఒకే పార్టీ విధానాలతో దేశంలో ప్రజాస్వామ్య హక్కులను మోదీ సర్కారు కాలరాస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ విమర్శించారు. సీపీఎం నాయకులు బుధవారం క్విట్ ప్రైవేటీకరణ-క్విట్ కార్పొరేట్ నినాదంతో పట్టణంలో నిరసన ర్యాలీ చేపట్టారు. సీపీఎం పట్టణ కార్యదర్శి భజంత్రీశ్రీనివాసులు, నాయకులు దాసరిశ్రీనివాసులు, జగ్గిలి రమేష్, సాకేనాగరాజు, మారుతి, రంగమ్మ, తిమ్మప్ప, చరణ్, ప్రతాప్ పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు భంగం కల్గిస్తే సహించం

పెద్దవడుగూరు : మండలంలో ఎవరైనా శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే సహించబోమని యాడికి సీఐ శంకర్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం ఎస్ఐ శ్రీనివాసులుతో కలిసి క్రిష్టిపాడులో మొహర్రం నిర్వహణపై గ్రామస్తులతో చర్చించారు. గ్రామాల్లో ఎవరైనా అనుమతి లేకుండా మొహర్రం నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా లక్ష్మయ్య



గుంతకల్లుటౌన్: గుంతకల్లు ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ లక్ష్మయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో గతంలో ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పని చేసిన జ్ఞానేశ్వర్ ఆలూరు డిగ్రీ కళాశాలకు బదిలీ కాగా, ఆయన స్థానంలో బుక్కపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న లక్ష్మయ్య ఇక్కడికి వచ్చారు. డాక్టర్ లక్ష్మయ్య ఎస్‌కేపీ కాంపొజిట్ (ఇంటర్, డిగ్రీ)ప్రభుత్వ కళాశాల పూర్వవిద్యార్థి. 1982-84 వరకు ఇదే కళాశాలలో ఇంటర్మీడియట్(బైపీసీ)ని పూర్తి చేశారు. తాను చదివిన కళాశాలకే ప్రిన్సిపాల్ కావడం సంతోషంగా ఉందన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

పెద్దవడుగూరు : రోడ్డు ప్రమాదాలు నివారణకు చర్యలు తీసుకుంటున్నామని యాడికి సీఐ శంకర్‌రెడ్డి, ఎస్ఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం పెద్దవడుగూరు నుంచి లక్ష్ముంపల్లి మీదుగా క్రిష్టిపాడు గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా కంపచెట్ల ను వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్రకార్యదర్శి గూడూరు సూర్యనారాయణరెడ్డి, కడదరగుట్టపల్లి హరినాథరెడ్డి, క్రిష్టిపాడు మల్లేశ్వరరెడ్డి సహకారంతో కంప చెట్లు తొలగించినట్లు వారు తెలిపారు.

గద్దర్‌కు ఘన నివాళి

పామిడి: స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద బుధవారం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి సాకే ఓబులేసు ఆధ్వర్యంలో గద్దర్‌కు ఘన నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదపీడిత ప్రజల సామాజిక న్యాయం కోసం పోరాటాలు సాగించిన విప్లవయోధుడు గద్దర్ అన్నారు. కోదండ రామ చెక్క భజన వ్యవస్థాపక అధ్యక్షుడు అమ్మలదిన్నె కుళ్లాయప్ప, కోదండరామ్ పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక

పామిడి: స్థానిక అంబేడ్కర్ కాలనీ పాఠశాల ప్రాంగణంలో గురువారం ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బీవీ రమణ సమక్షంలో మండల కార్యవర్గం ఎన్నిక జరిగింది. కమిటీ గౌరవాధ్యక్షుడిగా కే ఉజ్జినప్ప, అధ్యక్షుడిగా ఎస్ నూర్‌మహమ్మద్, ప్రధాన కార్యదర్శిగా పీ రామాంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం అభివృద్ధికి పాటుపడతామని ఈసందర్భంగా నూతన కార్యవర్గం పేర్కొంది. సంఘం సభ్యులు మల్లికార్జున, కుమార్, ప్రసాద్, పుల్లయ్య, జిలాన్‌బాషా, జాకీర్‌హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ విక్రయ దుకాణాల తనిఖీ

గుత్తి: పట్టణంలోని పలు ప్లాస్టిక్ విక్రయ దుకాణాల్లో మున్సిపల్ కమిషనర్‌తో పాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగయ్య, హెల్త్ అసిస్టెంట్లు, సచివాలయ ఉద్యోగులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిషేధిత ప్లాస్టిక్‌ను విక్రయిస్తున్న ఇద్దరు దుకాణదారులకు జరిమానా విధించారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గార్లదిన్నె: కమలాపురంలో బుధవారం ఓవ్యక్తి ఆత్మహత్యకు యత్నించాడు. 108 సిబ్బంది తెలిపిన వివరాలు..గ్రామానికి చెందిన ఆదెప్ప అనే వ్యక్తి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుమందుతాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని కుటుంబ సభ్యులు 108లో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

యాడికి: మండల కేంద్రంలోని కోనుప్పలపాడు రహదారిలో పేకాట స్థావరంపై ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి బుధవారం దాడి చేశారు. ఏడుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసి రూ.10,200 నగదు స్వాధీనం చేసుకున్నారు.

మొక్కలు లేనిదే మానవ మనుగడ లేదు


మొక్క నాటుతున్న వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కోరి

బుక్కరాయసముద్రం: సమాజంలో మొక్కలు లేనిదే మానవ మనుగడ లేదని సెంట్రల్ యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ ఏ.కోరి పేర్కొన్నారు. నా భూమి- నా దేశం కార్యక్రమంలో భాగంగా జంతలూరు వద్ద ఉన్న సెంట్రల్ యూనివర్సిటీ శాశ్వత క్యాంపస్‌లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ఏ కోరి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రెండు చెట్లును నాటి వాటిని సంరక్షించాలన్నారు. యువత దేశ రక్షణలో భాగస్వామ్యం కావాలన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. వీర జవాన్లను స్ఫూర్తిగా తీసుకుని వారి పేరుమీద మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ రామిరెడ్డి, ఈఈ శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ రవీంద్రబాబు, అధ్యాపకులు, వలంటీర్లు బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

గుత్తి రూరల్: మానవ మనుగడకు మొక్కలే ఆధారమని ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి పేర్కొన్నారు. బసినేపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం నా భూమి నాదేశం కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ మహబూబ్‌బీ, విద్యార్థులతో కలసి ఎంపీపీ మొక్కలు నాటారు. ఉప సర్పంచ్ హనుమంతు, ఏపీఓ మద్దిలేటి, వైఎస్సార్‌సీపీ నేత షెక్షావలి పాల్గొన్నారు.

యల్లనూరు: అమృత్ మహోత్సవంలో భాగంగా నాభూమి-నాదేశం కార్యక్రమాన్ని మేడికుర్తి, పెద్దమల్లేపల్లి, చింతకాయమంద గ్రామాల్లో బుధవారం ప్రారంభించారు. ఎంపీపీ గంగాదేవి, సర్పంచులు ప్రభాకర్‌రెడ్డి, విజయలక్ష్మి, ఉప సర్పంచు భాస్కర్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి ఫిరోజ్‌ఖాన్, ఏపీడీ వెంకటరత్నం , ఎంపీడీఓ వీరరాజు, ఏపీఓ షబ్బీర్ బాషా శిలాఫలకం ఆవిష్కరించడంతోపాటు, మొక్కలు నాటారు. హెడ్‌కానిస్టేబుల్ వెంకటరాముడును అధికారులు సన్మానించారు.

బుక్కరాయసముద్రం: రేకులకుంట గ్రామ సచివాలయంలో బుధవారం నా భూమి- నాదేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సునీత మాట్లాడుతూ దేశం కోసం ఎంతో మంది వీరులు ప్రాణాలు అర్పించారని, వారి సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ విజయభాస్కర్, సర్పంచ్ నరసమ్మ, ఏపీఓ పోలేరయ్య, ఈసీ ఓం ప్రసాద్, టెక్నికల్ అసిస్టెంట్ క్రిష్టప్ప, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పుట్లూరు: మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో బుధవారం నా భూమి-నాదేశం కార్యక్రమంలో భాగంగా అధికారులు మొక్కలు నాటారు. మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం వద్ద ఎంపీడీఓ యోగానందరెడ్డి శిలాఫలకం ఆవిష్కరించడంతో పాటు మొక్కలను నాటారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

శింగనమల: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం నాభూమి-నాదేశం శిలాఫలకాన్ని ఎంపీపీ యోగేశ్వరి అవిష్కరించారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కేంద్రాల్లో శిలాఫలకాలను ఏర్పాటు చేసినట్లు ఎంపీపీ తెలిపారు. ఎంపీడీఓ నిర్మలాకుమారి, ఏపీఓ శ్రీదేవి, ఎంపీటీసీ కురబ ఉమా, హెచ్‌ఎం సుజాతమ్మ పాల్గొన్నారు.